'చదువుకు పేదరికం అడ్డుకాదు'

అశోక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం, కూరెళ్ల విఠలాచార్య, చిత్రంలో సుధాకర్

రామన్నపేట, డిసెంబర్ 5 : పట్టుదల ఉంటే చదువుకు పేదరికం, అంగవైకల్యం అడ్డుకాదని నకిరేకంటి అశోక్ నిరూపించాడని, నేటితరం యువతకు ఆయన స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ కోదండరాం, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ చెరుకు సుధాకర్ అన్నారు. ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన నకిరేకంటి అశోక్‌కు మండలంలోని వెల్లంకి గ్రామంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని కూరెళ్ల గ్రంథాలయాన్ని సందర్శించి విఠలాచార్యను సన్మానించారు. బౌద్ధ అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే అంశంపై అనేక విషయాలను శోధించి రెండు వందలకు పైగా పేజీలతో పరిశోధన గ్రంథం రాయడం అంత తేలికైన విషయం కాదన్నారు. ఓర్పు, సహనం, పట్టుదలతోనే అది సాధ్యమవుతుందని తెలిపారు. అశోక్ తన పరిశోధన ద్వారా దివ్యాంగులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలనే బాధ్యతను పాలకులకు తెలిసేలా గుర్తు చేశారన్నారు. ఈ సందర్భంగా అశోక్‌ను పలువురు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు కోదండరాంకు వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచ్ కూరెళ్ల నర్సింహాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ బ్రహ్మానందం, నాయకులు రేపాక శ్రీనివాస్, హన్మంతరెడ్డి, ఎస్‌కే చాంద్, జేఎస్ మార్టిన్, అబ్రహంకుమార్, బండ్ల కృష్ణ పాల్గొన్నారు.

రైస్ మిల్లులో సివిల్ సప్లయ్ జిల్లా అధికారి తనిఖీ

రైస్ మిల్లులో ధాన్యం స్టాక్‌ను పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ జిల్లా అధికారి వనజాత

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 5 : మున్సిపాలిటీ పరిధి ముక్తాపూర్‌లోని లక్ష్మీనరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో సివిల్ సప్లయ్ జిల్లా అధికారి వనజాత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్లు నిర్వహణ, ధాన్యం స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైస్ మిల్లు మూతపడి సంవత్సరమైందని, అందులో ఉన్న ధాన్యానికి భద్రత కరువైందని అన్నారు. మిల్లులో కోతులు ప్రవేశించి విచ్చలవిడిగా ధాన్యాన్ని కింద పోస్తున్నాయని, వర్షపు నీరు చేరి ధాన్యం తడిసిందని తెలిపారు. సీఎంఆర్‌కు ఇవ్వకుండా రైస్ మిల్లును బంద్ చేయడంతో ధాన్యాన్ని పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. రూ.17.67 కోట్ల విలువైన 66,690 మెట్రిక్ టన్నుల లెవీ బియ్యం ఇవ్వాల్సి ఉందన్నారు. 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉందన్నారు. ఆమె వెంట తాసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఆర్ఐ నర్సింహారెడ్డి, నాయకులు గోరంటి సుదర్శన్‌రెడ్డి, దారెడ్డి మల్లారెడ్డి, బుచ్చిరెడ్డి, అంజిరెడ్డి, రామచంద్రారెడ్డి, మంచాల మధు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- పశుగణాభివృద్ధి శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ రాజశేఖర్

రామన్నపేట : పశు వైద్య శిబిరంలో పాల్గొన్న జిల్లా సహాయ సంచాలకుడు రాజశేఖర్

రామన్నపేట, డిసెంబర్ 5 : పశుగణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుగణాభివృద్ధి శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మండలంలోని దుబ్బాక గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పశుసంపద పెంపు కోసం కృత్రిమ గర్భధారణ చికిత్సలు చేశారు. 187 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు, దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకురాలు డాక్టర్ ఇందిర, డాక్టర్ వెంకటేశ్వర్లు, డీఎల్‌డీఏ పర్యవేక్షకుడు మహేశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫామ్ పంపిణీ

చిన్నారులకు యూనిఫామ్ అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

రామన్నపేట, డిసెంబర్ 5 : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు గురువారం యూనిఫామ్ పంపిణీ చేశారు. బాలురకు చొక్కా, నిక్కరు, బాలికలకు గౌన్లు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు శర్వాణి, జనార్దన్, వాజిదా తబసుమ్, అంగన్‌వాడీ టీచర్లు జి.లలిత, ప్రవీణ, రేణుక, సువర్ణ, కవిత పాల్గొన్నారు.

వసతి గృహాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలి

విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న వార్డెన్ భిక్షం

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 5 : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల తల్లిదండ్రులతో వార్డెన్ రెమిడాల భిక్షం గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం వసతి గృహంలో ఉండేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందజేసే సదుపాయాలను సద్వినియోగం చేసుకొని కృషి, పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

గుట్టలో వైభవంగా నిత్యోత్సవాలు

స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 5 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గురువారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామి, అమ్మవార్లకు సహస్రనామార్చన చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాల ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. అనంతరం స్వామికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాల పేరిట సంకల్పం చేశారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. ప్రధానాలయంలో సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు సహస్రనామార్చన, శయనోత్సవ సేవను శాస్త్రోక్తంగా జరిపారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 7వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.14,73,144 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

భూమి రిజిస్ట్రేషన్ చేయాలని వృద్ధ దంపతుల నిరసన

- తాసీల్దార్ కారు ముందు బైఠాయింపు
- అనంతరం రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన తాసీల్దార్

తాసీల్దార్ కారు ముందు బైఠాయించిన వృద్ధ దంపతులు

సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 5 : ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న తురువాత తన కొడుకు ఇచ్చే డబ్బులకు అమ్ముడుపోయి తాసీల్దార్ రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నాడని వృద్ధ దంపతులు ఆరోపించారు. తాసీల్దార్ కారు ముందు మూడు గంటల పాటు బైఠాయించి నిరసన తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జక్కిడి బాల్‌రెడ్డికి 40 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో 36 ఎకరాలను గతంలోనే తన కొడుకు శ్రీనివాస్‌రెడ్డి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాడు. అనంతరం వృద్ధులైన తల్లిదండ్రులను కొడుకు చూడకపోవడంతో తన పేర ఉన్న 4ఎకరాల భూమిని బాల్‌రెడ్డి ఇతరులకు అమ్మకానికి పెట్టాడు. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ కోసం గురువారం 12గంటలకు స్లాట్ బుక్ చేసుకున్నాడు. స్లాట్ బుక్ చేసుకున్న తురువాత కొడుకు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు చేశాడని తాసీల్దార్ రిజిస్ట్రేషన్ చేయకుండా నిలిపివేశారు. దీంతో వృద్ధ దంపతులు నిరసనకు దిగారు. తాను సంపాదించిన, తన పేరు మీద పట్టా అయిన భూమిని స్లాట్ బుక్ చేసుకున్న తురువాత ఎందుకు రిజిస్ట్రేషన్ చేయడం లేదని తాసీల్దార్ కారు ముందు బైఠాయించారు. రిజిస్ట్రేషన్ చేయకుంటే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. అయినా.. తాసీల్దార్ స్పందించకపోవడంతో దాదాపు మూడు గంటలపాటు ఆయన కారు ముందు బైఠాయించారు. తన కొడుకు ఇచ్చే డబ్బులకు తాసీల్దార్ అమ్ముడుపోయి తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని వృద్ధులు కన్నీటి పర్యంతమయ్యారు. వాడు ఇచ్చే పైసలు ఏందో తానే ఇస్తాను. తన భూమి రిజిస్ట్రేషన్ చేయాలని తాసీల్దార్‌కు వృద్ధ దంపతులు మొర పెట్టుకున్నారు. సమస్య జఠిలం అవుతుందని గ్రహించిన తాసీల్దార్ చివరికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. డబ్బులకు ఆశపడి తనను మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన తాసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వృద్ధులు తెలిపారు. ఈ విషయంపై తాసీల్దార్ కృష్ణను వివరణ కోరగా.. కుటుంబ సభ్యులకు కొంత సమయం ఇచ్చి తరువాత రిజిస్ట్రేషన్ పూర్తి చేశానని తెలిపారు.

యువకుడు అదృశ్యం

రామన్నపేట, డిసెంబర్ 5 : మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ పి.మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన మల్లం వరప్రసాద్ (29) బుధవారం పని నిమిత్తం భువనగిరికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. అనంతరం ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో చుట్టుపక్కల వెతికారు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో గురువారం అతని సోదరుడు మల్లం బాలకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

7న ఆటోల బంద్

ఆలేరు రూరల్, డిసెంబర్ 5 : ఆటో, క్యాబ్ డ్రైవర్ల జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 7న చేపట్టే ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని కొలనుపాక గ్రామంలో గురువారం విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా అమలు చేయడం లేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతిన్నదని పేర్కొన్నారు. సమావేశంలో ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు కోటగిరి కృష్ణ మూర్తిగౌడ్, దూడల కృష్ణగౌడ్, సుభాశ్, దశరథ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) పాల సంఘం చైర్మన్‌గా బుచ్చిరెడ్డి

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 5 : మండల కేంద్రంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా పాల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా నరాల బుచ్చిరెడ్డి, డైరెక్టర్లుగా నాతి రాజుగౌడ్, బూడిద మల్లయ్య, కొల రాములు, పంజాల వెంకన్న, యాస వెంకట్‌రెడ్డి, బాసాని రాములు, పంజాల కృష్ణమూర్తి, రంగ శ్రీను, నర్సింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో మాజీ సర్పంచ్ జన్నాయికొడె నగేశ్, పాల కేంద్రం కార్యదర్శి పంజాల నర్సయ్యగౌడ్, సిబ్బంది శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం'

రాజాపేట, డిసెంబర్ 5 : ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాసం వద్ద మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని పోలీసులు అక్రమ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ చింతలపూరి వెంకట్‌రాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అరెస్టులతో పోరాటాన్ని ఆపలేన్నారు. అక్రమంగా అరెస్టు చేస్తే తెలంగాణ ప్రజానీకం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ రేణికుంట గ్రామ శాఖ అధ్యక్షుడు సంగి ఉపేందర్ పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించాలి : ఏడీఏ

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ పద్మావతి

ఆలేరు రూరల్, డిసెంబర్ 5 : ప్రపంచ మృత్తిక దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని కొలనుపాక రైతువేదికలో గురువారం రైతులకు ఏడీఏ పద్మావతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంట మార్పిడితోపాటు పంట వేసే ముందు పశువుల పేడ, గొర్ల పెంట వాడాలన్నారు. భూసార పరీక్షలు చేయించి వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని సూచించారు. ఏఓ శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ ఆరె మల్లేశ్‌గౌడ్, ఏఈఓ శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటే సహించం : రామకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

వలిగొండ, డిసెంబర్ 5 : ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ మంత్రి పదవి కోసం మాలలను రెచ్చగొడుతూ మాదిగలను విమర్శిస్తున్నారన్నారు. మాదిగలపై విషం చిమ్ముతున్న వివేక్‌కు తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. 30 సంవత్సరాలుగా పోరాటాలు చేసి సాధించుకున్న సుప్రీం కోర్టు తీర్పును తప్పుపడుతూ మాదిగలను విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. వర్గీకరణకు అన్ని పార్టీలు అనుకూలంగా తీర్మానించాయని తెలిపారు. మంద కృష్ణ మాదిగను విమర్శిస్తే తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందన్నారు. సమావేశంలో నాయకులు ఇటుకల దేవేందర్ మాదిగ, సందెల శ్రీనివాస్, దుబ్బ దానయ్య, పల్లెర్ల రామచంద్రం, భిక్షపతి, కుమార్, స్వామి, జహంగీర్, భాస్కర్, మల్లేశం, లింగస్వామి పాల్గొన్నారు.

'టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి'

బొమ్మలరామారం, డిసెంబర్ 5 : బీబీనగర్ మండలంలోని కొండమడుగు గ్రామంలో ఈ నెల 8న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా 5వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మండలాధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, అందరికీ సమానమైన, నాణ్యమైన విద్య అందేవరకు ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శివనారాయణ, ఉపాధ్యక్షులు సేవా, జయలక్ష్మి, కోశాధికారి బాలరాజు, జీహెచ్ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ విడుదల చేస్తున్న టీఎస్ యూటీఎఫ్ మండల నాయకులు

బీబీనగర్‌లో పగిలిన గ్యాస్ పైపులైన్

మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బీబీనగర్, డిసెంబర్ 5 : మండల కేంద్రంలోని స్టేషన్ రోడ్డు ఆవరణలో మిషన్ భగీరథ పైపులైన్‌కు గురువారం మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులు చేస్తుండగా అప్పటికే భూమిలో ఉన్న గ్యాస్ పైపులైన్‌కు తగిలి పగిలింది. పగిలిన పైపు నుంచి ఒక్కసారిగా గ్యాస్ లీక్ కావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది గ్యాస్ సరఫరాదారులకు సమాచారం అందించారు. వారు గ్యాస్ సరఫరాను నిలిపివేసి పైపులైన్ మరమ్మతులు చేపట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

చేనేత ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, చేనేత, జౌళి శాఖ అధికారులు

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 5 : చేనేత కార్మికుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో నేతాజీ చౌరస్తా నుంచి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వరకు గురువారం చేనేత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం రేవణపల్లి గ్రామ పరిధిలోని దివీస్ లేబొరేటరీస్ ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. 33మందికి సీఎంఆర్ఎఫ్, 89మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, నేతన్న చేయూత పథకం కింద రూ.34.11కోట్ల చెక్కు అందజేశారు. విద్యార్థులకు మెడల్స్, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సిబ్బందికి దుస్తులు, శానిటేషన్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం చేనేత డై హౌస్ భవనంలో కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చేనేత కార్మికుల రుణమాఫీకి ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు.

కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ, అదనపు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఏడీ మహమ్మద్ కామిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్, తాసీల్దార్ మహేందర్‌రెడ్డి, చేనేత నాయకులు తడక వెంకటేశ్, తడక రమేశ్, భారత లవకుమార్, అంకం పాండు పాల్గొన్నారు.

చంద్రయ్య కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ



చంద్రయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 5 : మండలంలోని కంతంగూడెం గ్రామానికి చెందిన ఏనుగుల చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. చంద్రయ్య చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్ పరామర్శ

నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

యాదగిరిగుట్ట, డిసెంబర్ 5 : మోటకొండూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకుడు భూమండ్ల ఐలయ్య తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఐలయ్యను మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గుండాల మాజీ జడ్పీటీసీ రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ కురుమ, గ్రామ శాఖ అధ్యక్షుడు భూమండ్ల సుధీర్, నాయకులు సిద్ధులు, నర్సింహ, లక్ష్మీనారాయణ ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 5 : ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేసే మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు, కో కన్వీనర్ ప్రసాదం విష్ణు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు 4నెలలుగా పెండింగ్ బిల్లులు రాక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. అప్పులు తెచ్చి వంట చేస్తున్నారని తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, చేనేత నాయకులు తడక వెంకటేశ్, తడక రమేశ్, భారత లవకుమార్, మధ్యాహ్న భోజన కార్మికులు వెంకటమ్మ, కవిత, సాలమ్మ, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు శారాజీపేట విద్యార్థుల ఎంపిక

శారాజీపేట జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆలేరు రూరల్, డిసెంబర్ 5 : 68వ పాఠశాలల క్రీడల్లో భాగంగా ఇటీవల ఆలేరులో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫుట్‌బాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో మండలంలోని శారాజీపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జ్యోతిరాజ్, ఫిజికల్ డైరెక్టర్ గడసంతల మధుసూదన్ తెలిపారు. 9వ తరగతి విద్యార్థులు వైష్ణవి, తీర్థశ్రీ, 8వ తరగతి విద్యార్థులు చెరుకూరి మహేందర్, గౌతమ్ ఎంపికయ్యారు.

వీరు ఈ నెలలో వనపర్తిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పలు కుటుంబాలకు బీఆర్ఎస్ ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 5 : మండలంలోని కూరెళ్లలో ఇటీవల మృతి చెందిన కస్తూరి ముత్యాలకృష్ణ కుటుంబానికి బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో గురువారం రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన మారుపాక ఉప్పలయ్య కుటుంబానికి కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరిదీప్‌రెడ్డి సహకారంతో రూ.5వేలను స్థానిక బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. గ్రామ మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య, బీఆర్ఎస్ నాయకులు ఎరుకల స్వామిగౌడ్, గడ్డం అశోక్, మాజీ సర్పంచ్ ఉప్పల ముత్యాలు, సురేశ్, మణికుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేశ్, సీపీఐ జిల్లా నాయకుడు ముత్యాలు, సోమిరెడ్డి, జహంగీర్ పాల్గొన్నారు.